క్లుప్తంగా

ఆసిఫ్‌కు సత్కారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యాధరపురం 39వ డివిజన్‌కు చెందిన సూపర్ డూపర్ షటిల్ అసోసియేషన్ సభ్యులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్‌ను సత్కరించారు. ఆదివారం అసోసియేషన్ ప్రతినిధులను ఆసిఫ్ కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతనిధులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. పశ్చిమంలో ఆసిఫ్‌ను గెలిపిస్తామని చెప్పారు. ఆసిఫ్‌ను సత్కరించిన వారిలో అసోసియేషన్ సభ్యులు సురేష్, కిషోర్, కార్పొరేటర్లు మండేపూడి చటర్జీ, గుడివాడ నరేంద్ర, ఇర్ఫాన్, పార్టీ నాయకులు తనుబుద్ధి చంద్రశేఖర్ రెడ్డి, దేరంగుల రమణ, జిలాని తదితరులు ఉన్నారు.

పసుమర్తి శ్రీరామచంద్రమూర్తికి అన్నదాన రత్న పురస్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని మాచవరానికి చెందిన అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ కార్యదర్శి పసుమర్తి శ్రీ రామచంద్రమూర్తిని సర్ సీవీ రామన్ అకాడమీ(సేవ సాంస్కృతిక సంస్థ) ఆదివారం అన్నదాన రత్న పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అన్న సంతర్పణ సమితి ద్వారా అందిస్తున్న సేవలకు గానూ ఆయనకు సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో సినీ హాస్యనటుడు జెన్నీ, నటుడు కాదంబరి కిరణ్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ పగడాల అశోక్, శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి చేతుల మీదుగా ఆదివారం పురస్కారం అందుకున్నారు. సన్మాన గ్రహీత శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ.. పురస్కారంతో తమపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ పసుమర్తి శ్రీరామచంద్రమూర్తిని అభినందించారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



పెనమలూరు: జాతీయ కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. సుమన్ షూటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఏపీ చీఫ్ ఎస్.దుర్గారావు ఆదివారం వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేటలో ఆదివారం జాతీయ కరాటే పోటీలు నిర్వహించారన్నారు. కృష్ణాజిల్లా నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న బి.లక్ష్మణ్ నాగశ్రీనివాస్, ఎండీ నిజాముద్దీన్, దేవిశంకర్, ఎండీ నియమతుల్లా, కార్తికేసాయి బంగారు పతకాలు గెలిచారన్నారు. ఆరిఫ్, ఆర్.ప్రభుకిరణ్ రెడ్డి, పి.గణేష్ వెంకటసాయి, ఎండీ యూసుఫ్‌కు రజత పతకాలు వచ్చాయి. జె.తేజస్విని, ఎన్వీ.మురళి, ధరణి దుర్గాదేవీలకు కాంస్య పతకాలు వచ్చాయని దుర్గారావు తెలిపారు.

మారిన 38వ డివిజన్ రూపురేఖలు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి పరుగులు
- రూ.10 కోట్లతో మౌలిక సదుపాయాలు



మురుగు నీటిని శుద్ధి చేసే సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 38వ డివిజన్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. గత ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ డివిజన్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అంచెలంచెలుగా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. గడిచిన నాలుగేళ్ల పది నెలల కాలంలో ఆ పరుగు మరింత ఊపందుకుని అనేక అభివృద్ధి పనులతో ఇప్పుడు డివిజన్ ప్రజల హర్షధ్వానాల నడుమ విరాజిల్లుతుంది. ఇది కదా అభివృద్ధి అంటే అంటూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పునర్విభజనలో బాగంగా ఈ డివిజన్ పరిధిలో విద్యాధరపురంలో కొంత, వన్ టౌన్ మల్లికార్జునపేటలో మరి కొంత చేరింది. అయితే ఆయా ప్రాంతాల్లో ఎక్కువ భాగం కొండ ప్రాంతం ఉండటం గమనార్హం. మొత్తం మీద కొండ ప్రాంతంలో దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మెట్లు, సైడు కాలువలు ధ్వంసమై కొండపై నివసించే ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చే వరకు గిరివాసుల ఇబ్బందులను పట్టించుకున్న నాథుడే లేరు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కొండ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలను కల్పించారు.

ఎస్టీపీ ఏర్పాటు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల్లోనే రూ.1.70 కోట్లతో డివిజన్ పరిధిలోని చేపల రేవు వద్ద(మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వెనుక) 0.5 ఎంఎల్‌డీ సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మించారు. డివిజన్ పరిధిలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్స్, సైడు కాలువల ద్వారా వచ్చే మురుగు నీటిని ఈ ప్లాంట్ ద్వారా దశలవారీగా శుద్ధి చేస్తుంది. అనంతరం ఆ నీటిని ట్యాంకర్స్‌లో నింపి నగర పాలక సంస్థకు చెందిన పార్కులలోని మొక్కలు, డివైడర్స్‌పై ఉండే మొక్కలకు వినియోగిస్తున్నారు. ఇంకా మిగిలితే పక్కనే ఉన్న కృష్ణానదిలోకి వదులుతున్నారు.

రూ.90 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి

టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని హిందూ శ్మశానవాటికను రూ.90 లక్షలతో అభివృద్ధి చేశారు. ఇది గట్టు వెనుక వెనుక ప్రాంతంలో ఉన్న ఏకైక హిందూ శ్మశానవాటిక. విజయవాడ నగరంలో తొలిసారిగా ఇక్కడ గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం ఏర్పాటు చేశారు. దీనికి రూ.60 లక్షలు ఖర్చు చేయగా, బాత్ రూమ్స్, జనరేటర్ గది, అస్తికలను భద్రపరచేందుకు గది, టాయిలెట్స్ వంటి వసతులను రూ.30 లక్షలతో కల్పించారు. ఇవి కాకుండా మృతదేహంతో పాటు వచ్చే బంధుమిత్రులు కొద్ది సేపు సేద తీరేందుకు రేకుల షెడ్ నిర్మించారు. శ్మశానవాటిక రూపురేఖలను మార్చడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటిక ముందున్న ఖాళీ స్థలంలో రూ.3 లక్షలతో శానిటరీ స్టోరేజ్ రూమ్‌ను నిర్మించనున్నారు.

రూ.60 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

డివిజన్ పరిధిలోని మల్లికార్జునపేటలో రూ.60 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రజలకు అందుబాటులో రానుంది. సామాన్యులు చిన్న చిన్న ఫంక్షన్లు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇది దోహదపడుతుంది. డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నిమిత్తం స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పలు ప్రతిపాదనలు చేసి వాటికి అంచనాలను కూడా వేయించారు. వాటిల్లో రూ.1.30 లక్షలతో ప్రకాశం బ్యారేజీ దగ్గర లోతట్టులో ఉన్న హజరత్ సయ్యద్ అలీ ఖాదరీ దర్గా ఎత్తు పెంచటం, ఆవరణలో మసీదు, విడిది గదుల నిర్మాణం, కోటి రూపాయలతో డీఎస్ఎం హైస్కూల్ ఎదుట మలేరియా హాస్పిటల్, జనన మరణాల నమోదు కార్యాలయం, జిమ్ ఏర్పాటుకు భవనం నిర్మించారు.



మల్లికార్జునపేటలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్

అభివృద్ధి చేసి చూపించాం..



చంద్రబాబు మాదిరిగా అభివృద్ధిని గ్రాఫిక్స్‌లో చూపించం. సీఎం జగన్ మోహన్‌రెడ్డిది చేతల ప్రభుత్వం. అందుకే గతంలో జరగని అభివృద్ధి పనులను చేసి చూపించాం. కళ్లకు కట్టినట్లు కనబడుతున్న అభివృద్ధిని చూసిన ప్రజలు చంద్రబాబు పాలనకి జగనన్న పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు బేరీజు వేసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. డివిజన్ ఇంతగా అభివృద్ధి చెందుతుందంటే స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సహకారమే కారణం.

– షేక్ రెహమతున్నీసా,
38వ డివిజన్ కార్పొరేటర్

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న డీసీపీ కృష్ణకాంత్ పాటిల్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వెస్ట్‌జోన్ పరిధిలోని రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని డీసీపీ కృష్ణకాంత్ పాటిల్ తెలిపారు. వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్లలో పరిధిలో ఉన్న 249 మంది రౌడీషీటర్లకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ కృష్ణకాంత్ పాటిల్ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా సహించేది లేదన్నారు. అదేవిధంగా ఇతర కేసుల్లో ఇన్వాల్ అయినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో నడుచుకుంటే వారి పట్ల మరో ఆలోచన చేస్తామని చెప్పారు. ప్రధానంగా త్వరలో ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రౌడీషీటర్లు తమ కుటుంబం కోసమైనా చక్కని జీవితాలను ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించటం, రవాణా చేయటం వంటి నేరాలకు పాల్పడినా తీవ్రంగా చర్యలు ఉంటాయన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. అందరిపైనా పోలీసు నిఘా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ పి.మురళీకృష్ణారెడ్డి, ఆయా పోలీసుస్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.

పశ్చిమ నియోజకవర్గంలో హ్యాట్రిక్ ఖాయం

వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త షేక్ ఆసిఫ్

వించిపేట(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల ఆశీర్వాదంతో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్‌తో కలిసి ఆసిఫ్ డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో పర్యటించి డివిజన్‌లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పనులను వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పశ్చిమ నియోజకవర్గం కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుందని చెప్పారు.



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఆసిఫ్

రూ.1,300 కోట్లతో అభివృద్ధి పనులు

ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతుతో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ నియోజవర్గంలోనే రూ.1,300 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివాసముండే కొండ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు, మెట్లు, డ్రెయినేజీలు, వాటర్ ట్యాంకులు, రిటైనింగ్ వాల్స్ నిర్మించామని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉన్నా వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేశామన్న నమ్మకంతోనే ధైర్యంగా ఓట్లను అడిగేందుకు ప్రజల ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 49వ డివిజన్ అధ్యక్షుడు గొడుపేరు సుధీర్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు చేపూరి శ్రీనివాసరావు, పూనూరు జార్జి, జమ్మలమూడి మార్కు, తంగిరాల ప్రమీల, ఏనుగుల సునీల్‌కుమార్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పారా మిలటరీ బలగాల కవాతు



వైఎస్సార్ కాలనీలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా, సంఘ విద్రోహ శక్తులను నిర్మూలించేందుకు సిద్ధంగా ఉన్నామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రూరల్ ప్రాంతాలైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో ఆదివారం కేంద్ర పారా మిలటరీ బలగాలు, విజయవాడ నగర పోలీసు బలగాలు కవాతును నిర్వహించాయి. తొలుత కాలనీకి చేరుకున్న ప్రత్యేక పోలీసు బృందాలకు వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి పలు సూచనలు చేశారు. అనంతరం కాలనీలోని ప్రధాన రహదారులతో పాటు పాముల కాల్వ, అంబాపురం, నైనవరం ప్రాంతాల్లో కవాతు నిర్వహించిన ప్రజలకు భరోసా కల్పించారు. నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు వెస్ట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కవాతు నిర్వహించారు. త్వరలో జరగనున్న కేంద్ర, రాష్ట్ర ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖతో ప్రజలు సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండటమే కాకుండా శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొత్తపేట వన్‌టౌన్, భవానీపురం, ఇబ్రహీంపట్నం సీఐలు గణేష్, దుర్గాశేఖర్‌రెడ్డి, వి.కృష్ణ, సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎండలు పెరుగుతున్న దృష్ట్యా వృద్ధులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో డాక్టర్ కోనా వీరబ్రహ్మం అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా అన్ని రకాల వ్యాధులను నయం చేయవచ్చన్నారు. సీజనల్ పండ్లు, కాయగూరలను తీసుకుంటూ తరచూ నీటిని తీసుకోవాలని సూచించారు. ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం



ఇంద్రకీలాద్రిపై చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పోలియో రహిత సమాజమే లక్ష్యమని దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. పల్స్ పోలియోను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో చిన్నారులకు చైర్మన్ పోలియో చుక్కలు వేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఇంద్రకీలాద్రికి తరలివచ్చిన భక్తులు తమ చిన్నారులకు ఆలయ ప్రాంగణంలో పోలియో చుక్కలు వేయించారు. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్ల లోపు వారందరికీ రెండు చుక్కల మందు వేయించాలన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యుడు కనకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఊర్మిళానగర్, కనకదుర్గా రెడ్డి కాలనీలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిన వారి కోసం ప్రత్యేకంగా ఆరోగ్య శాఖ ఇంటింటిని సందర్శించి పోలియో చుక్కలు వేస్తుందన్నారు. డివిజన్‌లో 98 శాతానికి పైగా పోలియో చుక్కలు వేశామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ కోటిరెడ్డి

పుస్తక పఠనంతో విజ్ఞానం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో గ్రంథాలయంలో నీతి కథలు, జాతీయ నాయకుల చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, తెలుగు సామెతలు తదితర పుస్తకాలను ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారులు విద్యార్థులతో నీతి కథలు చదివించడం, చెప్పించడం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు 'ఏఐ'

ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ట్రాఫిక్ డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ) కె.చక్రవర్తి స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాలతో విజయవాడ మున్సిపల్ కమిషనరేట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే ముఖ్యమైన మూడు ప్రదేశాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దీనితో పాటు రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెరిగే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు, రహదారి భద్రతా పరంగా తలెత్తే వివాదాలను పరిష్కరించేందుకు నూతన ప్రణాళికకు సిద్ధం చేసినట్లు 'సాక్షి'తో ఆదివారం తెలిపారు.

సాక్షి: ఏఐ పని తీరు ఎలా ఉంటుంది.

డీసీపీ: నగరంలోని కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు ఫిక్స్‌డ్ టైం ఏర్పాటు చేశాం. అయితే కొన్ని కొన్ని సమయాల్లో ఆయా రోడ్లపై వెళ్లే వాహనాలు లేకున్నా సమయం(సెకన్లు) ఎక్కువగా ఉండటంతో సిగ్నల్ రెడ్‌లోనే ఉంటుంది. ఇది వేరే మార్గంలోని వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. దీన్ని పరిష్కరించేందుకే అడాప్టెడ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌లో భాగంగా ఏఐ టెక్నాలజీని అందుబాటులోకి తేవాలనుకుంటున్నాం. దీనిలో భాగంగానే కూడళ్లలోని ట్రాఫిక్ పోల్స్‌కు ప్రత్యేకంగా సిద్ధం చేసిన కెమెరాలను అమర్చుతాం. ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనాలను ఈ ఏఐ కెమెరాలు క్యాప్చర్ చేస్తాయి. ఏ మార్గంలో వాహనాలు ఎక్కువగా ఉన్నాయో, ఏ మార్గంలో వాహనాలు తక్కువగా ఉన్నాయో కెమెరాలు వాటంతట అవే తెలుసుకుంటాయి. ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం వాహనాలు ఎక్కువగా ఉన్న మార్గానికి వెంటనే ఎక్కువ సమయం కేటాయిస్తాయి. వాహనాలు తక్కువ ఉన్న మార్గానికి సమయం తగ్గించేస్తుంటాయి. ఇది ఆటోమెటిక్‌గా పని చేస్తుంది. పైలట్ ప్రాజెక్ట్‌లో ఏఐ పనితీరు మెరుగ్గా, ప్రజలకు ఉపయోగకరంగా ఉందని తేలితే నగరంలోని అన్ని సిగ్నల్స్ వద్ద ఈ టెక్నాలజీని అమలు చేస్తాం.

సాక్షి: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రస్తుతం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

డీసీపీ: ఉదయం, సాయంత్రం వేళల్లో సిగ్నల్స్ వద్ద పెరిగే వాహనాల రద్దీ కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యను పరిష్కరించేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐటీఎంఎస్)ను అమలు చేస్తున్నాం. పీసీఆర్ జంక్షన్ నుంచి బెంజిసర్కిల్ వరకు, బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు వరకు, రామవరప్పాడు నుంచి తిరిగి(ఏలూరు రోడ్డు మీదుగా) పీసీఆర్ జంక్షన్ వరకు, బీఆర్టీఎస్ రోడ్డులలోని 17 సిగ్నల్స్ వద్ద ఐటీఎంఎస్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ సిగ్నల్ వ్యవస్థ పూర్తిగా కేంద్రీకృతమై.. కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉంటుంది. ఆయా సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ గురించి, సిగ్నల్స్ పనితీరు కంట్రోల్ రూం నుంచే తెలుసుకోవచ్చు. అక్కడ విధుల్లో ఉండే సిబ్బందికి కంట్రోల్‌రూం నుంచి దిశానిర్దేశం చేయొచ్చు. పలు రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధుల పర్యటన, ముందస్తు పోలీసు అనుమతి ఉన్న ర్యాలీల సందర్భంగా ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఈ విధానం సహాయపడుతుంది.

సాక్షి: రాత్రి సమయంలో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డీసీపీ: రాత్రి సమయంలో ప్రమాదాల నివారణకు బారికేట్లపై బ్లింకర్స్‌ను ఏర్పాటు చేశాం. నగరంలోని ప్రధాన కూడళ్లు, ఇతర కూడళ్ల వద్ద 300లకు పైగా బ్లింకర్స్‌ను ఏర్పాటు చేశాం. ఇవి పూర్తిగా సోలార్‌తో పని చేస్తాయి. పగటి సమయంలో ఆటోమేటిక్‌గా సూర్యరశ్మితో పవర్‌ను సేకరిస్తాయి. చీకటి పడగానే ఆటోమేటిక్‌గా అదే పవర్‌తో ఎరుపు, పసుపు రంగులలో బ్లింక్ అవుతూ వాహన చోదకులకు హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. వీటిని ఏర్పాటు చేసిన నాటి నుంచి రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది.

సాక్షి: ఎన్నికల సమయంలో వివాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యలు తెలపండి.

డీసీపీ: మద్యం సేవించి వాహనాలను నడిపే వ్యక్తులను అదుపు చేస్తే చాలా వరకు వివాదాలకు చెక్ పడుతుంది. ఈ బాధ్యత మా ట్రాఫిక్ విభాగంపైనే ఉంది. అందుకే ఇప్పటి నుంచే దూకుడు పెంచాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. గడిచిన 65 రోజుల్లో సిటీలో 1,273 మందిపై కేసులు నమోదు చేశాం. వీరిలో 1,002 మందిని కోర్టులో హాజరుపర్చగా నిందితులకు రూ.1.05 కోట్లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. 90 మందికి ఒకటి నుంచి ఎనిమిది రోజుల వరకు జైలు శిక్ష పడింది. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎవరినీ ఉపేక్షించేది లేదు. దీనితో పాటు ఈ-చలానా యాప్ మళ్లీ అందుబాటులోకి వచ్చింది. ట్రిపుల్ రైడ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ఈ-చలానా వచ్చేస్తుందని వాహన చోదకులు గుర్తించాలి. చలానాలను యూపీఐ(ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం) యాప్‌ల ద్వారా చెల్లించుకునే వెసులుబాటు ఉంది.

సాక్షి: అంబేడ్కర్ స్మృతివనం వద్ద ట్రాఫిక్ సమస్యను ఎలా పరిష్కరిస్తారు

డీసీపీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సామాజిక న్యాయ మహాశిల్పం అంబేడ్కర్ స్మృతివనం వద్ద ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. రాష్ట్ర, దేశ నలుమూలల నుంచి బస్సుల్లో, ప్రత్యేక వాహనాల్లో ఈ మహా శిల్పం చూసేందుకు భారీగా ప్రజలు వస్తున్నారు. విగ్రహం ఆవరణలో ద్విచక్ర వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశం సరిపోవడం లేదు. దీంతో పాత రైతుబజార్ రోడ్డులో ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాన్ని కేటాయించాం. పర్యాటకుల తాకిడితో అక్కడ పెరుగుతున్న ట్రాఫిక్‌ను పరిష్కరించేందుకు నిత్యం అక్కడ పది మంది పోలీసు అధికారుల, సిబ్బందికి విధులు కేటాయిస్తున్నాం.

నేడు బాబా మందిర 29వ వార్షికోత్సవం

పెనమలూరు: పోరంకి శ్రీనివాస నగర్‌లో శ్రీషిర్డి సాయిబాబా 29వ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు శ్రీషిర్డిసాయి సేవాసమితి అధ్యక్షుడు ఎం.అర్జున్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బాబావారికి సోమవారం కాగడా హారతి, మంగళస్నానం, 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేస్తామన్నారు. అలాగే పళ్ల రసంతో స్నపన, విశేష అలంకరణ, విష్ణు సహస్ర నామపారాయణం, తులసీదళ పూజలు, వెండి మారేడు దళాలతో విశేష అర్చన చేస్తామని తెలిపారు. పాదుకా ఉత్సవం, భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వణుకూరులో కంటి వైద్య పరీక్షలు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. నలంద డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అమరావతి సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి వైద్యులు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు చక్క గోపీకృష్ణ ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లు అందించామని డాక్టర్ నాదెండ్ల వేణు, కేతినేని శైలజ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.